క్లుప్తంగా

ఆశ్రమాలను సందర్శించిన న్యాయమూర్తి

కర్నూలు (లీగల్): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి మంగళవారం అబ్జర్వేషన్ హోమ్ ఫర్ బాయ్స్, వేదాస్ షెల్టర్ హోం, వన్‌స్టాప్ సెంటర్లను తనిఖీ చేశారు. ఆయా కార్యాలయాలకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించి అక్కడ ఉన్న ప్రజలకు, మహిళలకు వివిధ చట్టాలు, న్యాయ సహాయం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు, పిల్లలు లీగల్ సర్వీసెస్ యాక్ట్ 1987 ద్వారా ఉచిత న్యాయ సహాయం పొందుటకు అర్హులని తెలిపారు.

5న క్రికెట్ బాలుర జట్టుకు ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 5 వ తేదీ స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో ఉదయం 10 గంటలకు అండర్-19 క్రికెట్ విభాగంలో బాలుర జట్టుకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కె.దేవేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఆ పోటీల్లో పాల్గొనవచ్చని తెలిపారు. 2005 సంవత్సరం సెప్టెంబర్ 1 తేదీ తరువాత జన్మించిన వారు పోటీలకు అర్హులని తెలిపారు. ఎంపికయిన క్రీడాకారులు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటారని తెలిపారు.

ప్రచార రథాలు ప్రారంభం

కర్నూలు(సెంట్రల్): సార్వత్రిక ఎన్నికల కోసం కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి షేక్ జిలానీ బాషా రూపొందించిన కాంగ్రెస్ ప్రచార రథాలను డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు ప్రారంభించారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయం ఎదుట జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర్‌బాబు, పీసీసీ ప్రధాన కార్యదర్శి దామోదరం రాధాకృష్ణ, ఉండవెల్లి వెంకటన్న, డీసీసీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ గుప్తా పాల్గొన్నారు.

జీవనశైలి మారడంతో అనారోగ్యం



వృద్ధురాలికి బీపీ గురించి వివరిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): మనిషి జీవనశైలి మారడంతోనే అనారోగ్యానికి గురవుతున్నారని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్ చెప్పారు. మంగళవారం ఆయన మండలపరిధిలోని పసుపుల గ్రామంలోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మనిషి యాంత్రిక జీవనానికి అలవాటు పడుతున్న పరిస్థితుల్లో శారీరక, మానసిక ఒత్తిడిల కారణంగా అనేక రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. దీర్ఘకాలిక రోగాలు వస్తే అవి మనుషులను విడిచిపెట్టవన్నారు. అసంక్రమిత వ్యాధులతోనే అధికంగా మరణాలు సంభవిస్తున్నాయని, 30 సంవత్సరాలు దాటిన వారిలో బీపీ, షుగర్ వంటి సమస్యలు వస్తున్నాయని, మహిళల్లో క్యాన్సర్ల ముప్పు అధికంగా ఉందని, అసంక్రమిత వ్యాధులు సంక్రమించిన వారు ఆరోగ్యంగా కనిపిస్తున్నా వారి శరీరం లోపల గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాలు, నేత్రాలు తదితర కీలక అవయవాల పనితీరు మందగిస్తుందన్నారు. సకాలంలో గుర్తించకపోతే జీవితాంతం తీవ్ర సమస్యను ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ జయలక్ష్మి, ఎంపీహెచ్‌ఈవో వెంకటరమణ, పంచాయతి సెక్రటరి హేమంత్‌కుమార్‌రెడ్డి, ప్రాజెక్టనిస్టు ఖలీల్, సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు



సి.సి.పుల్లయ్యను సన్మానిస్తున్న దేవదాయ శాఖ అధికారులు

కర్నూలు కల్చరల్: అంకిత భావంతో విధులు నిర్వర్తించే ఉద్యోగులకు ఎప్పటికీ ప్రత్యేక గుర్తింపు ఉంటుందని పలువురు అధికారులు పేర్కొన్నారు. దేవదాయ శాఖ మల్టీజోన్-2 ఎస్‌ఈగా విధులు నిర్వహించిన సి.సి.పుల్లయ్య మంగళవారం పదవీ విరమణ పొందారు. స్థానిక రాంబొట్ల ఆలయంలో పదవీ విరమణ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. పుల్లయ్య దేవదాయ శాఖలో వివిధ హోదాల్లో 33 సంవత్సరాలు విధులు నిర్వహిస్తూ గుర్తింపు పొందారని కొనియాడారు. అనంతరం ఆయనను దేవదాయ శాఖ అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎస్‌ఈ సిరిగుప్ప సతీష్, హెడ్ ఆఫీస్ ఈఈ గంగయ్య, శ్రీశైలం దేవస్థానం ఈఈ మురళీధర్‌రెడ్డి, డీఈ శ్రీనివాస ప్రసాద్, మంత్రాలయం ఏఈ బద్రినాథ్, హెడ్ ఆఫీస్ టెక్నికల్ అసిస్టెంట్ బదిరి రవి, డీసీ పట్టెం గురుప్రసాద్, రంగాపురం ఈఓ డీసీ రామాంజనేయులు పాల్గొన్నారు.

బాబుది కాపీ మేనిఫెస్టో

- అమలు చేయని మేనిఫెస్టోను ప్రజలు నమ్మరు
- మళ్లీ వైఎస్సార్‌సీపీదే అధికారం
- పార్టీ కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్
- ఇంటింటికీ ఇంతియాజ్ కార్యక్రమానికి విశేష స్పందన
- 17వ వార్డులో సమీనా ఇంతియాజ్ ఎన్నికల ప్రచారం



సీతారాం నగర్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న కర్నూలు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బీవై రామయ్య, ఇంతియాజ్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే ఎస్వీమోహన్‌రెడ్డి

కర్నూలు (టౌన్): తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను కాపీ కొట్టి ప్రకటించారని, ఆయనకు అంటూ ఓ సొంత ఆలోచనలు లేవని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ విమర్శించారు. ఇంటింటికీ ఇంతియాజ్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం స్థానిక 44వ వార్డు సీతారాం నగర్‌లో కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి బీవై రామయ్య, మాజీ ఎమ్మెల్యే, కర్నూలు పార్లమెంట్ డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్ ఎస్వీ మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, స్థానిక కార్పొరేటర్లతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఓటర్లతో మాట్లాడారు. సంక్షేమ పథకాల గురించి వివరించారు. జగనన్న సంక్షేమ పాలన కొనసాగాలంటే మళ్లీ ఆయనను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. ప్రజల విశ్వాసం కోల్పోయిన తెలుగుదేశం పార్టీ అధికారం కోసం ఇతర పార్టీల మేనిఫెస్టోను కాపీ కొడుతుందన్నారు. ఇప్పటికే వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేదలకు అందిస్తున్నారన్నారు. ఐదేళ్లలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చారన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ ఆయనను ఆదరిస్తున్నారన్నారు. కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి బీవై రామయ్య మాట్లాడుతూ అలవి కాని హామీలు ఇచ్చిన చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. జగనన్న మేనిఫెస్టోలో ప్రకటించిన పథకాలనే మార్పులు చేర్పులు చేసి ప్రకటించుకున్నారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ అబద్ధాలు, కుట్రలు, కుతంత్రాలకు కేరాఫ్ చంద్రబాబు అని మండిపడ్డారు. బాబును నమ్మితే ప్రజలను నట్టేట ముంచుతారన్నారు. జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ మాట్లాడుతూ జగనన్న సంక్షేమం, అభివృద్ధే మళ్లీ వైఎస్సార్‌సీపీ గెలుపునకు నాంది అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆదిమోహన్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు రాజేశ్వరరెడ్డి, శ్రీనివాసరావు, బీసీసంఘం రాష్ట్ర నాయ కులు దేవపూజారి ధనుంజయ ఆచారి పాల్గొన్నారు.

17వ వార్డు గిరిప్రసాద్ నగర్‌లో..

17వ వార్డు గిరిప్రసాద్ నగర్‌లో ఇంతియాజ్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డితో కలసి ఇంటింటికీ తిరిగారు. జగనన్న మేనిఫెస్టో ప్రతులను ఓటర్లకు అందించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు సీహెచ్ మద్దయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ వెళ్లండి

జగనన్న సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించాలని వైఎస్సార్‌సీపీ శ్రేణులకు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్, కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి బీవై రామయ్య, జిల్లా కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు చైర్‌పర్సన్ విజయమనోహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గెలుపు తథ్యమని, అయితే ప్రతి నాయకుడు, కార్యకర్త ఇంటింటికీ వెళ్లి జగనన్న ప్రకటించిన మేనిఫెస్టోను వివరించాలన్నారు.

భర్తకు మద్దతుగా ..



ఓటు అభ్యర్థిస్తున్న సమీనా ఇంతియాజ్, చిత్రంలో ఎస్వీ విజయమనోహరి

కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన సతీమణి సమీనా ఇంతియాజ్ 17వ వార్డులో మంగళవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ విజయమనోహరితో కలిసి ఆమె ఇంటింటికి వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, పేదలకు మంచి జరుగుతుందని చెప్పారు.

13 తర్వాత మీ అంతు చూస్తా..!

- నీ చక్రపాణిరెడ్డిని పిల్చుకుని రా పో
- వైఎస్సార్‌సీపీ నేతలను బెదిరించిన టీడీపీ అభ్యర్థి బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

సాక్షి, నంద్యాల: 'రేయ్...ఏం పేరురా వాడి పేరు? రేయ్ చక్రపాణి నువ్వు రారా...నీ చక్రపాణిరెడ్డిని పిల్చుకొచ్చుకోపో, సిగ్గులేని నాయాల్లారా' అంటూ శ్రీశైలం టీడీపీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులపై బూతులు తిడుతూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బండిఆత్మకూరు మండలం సోమయాజులపల్లె గ్రామంలో మంగళవారం బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో రోడ్లు వేసింది మేమే...అంటూ ప్రసంగిస్తూ వైఎస్సార్‌సీపీ వాళ్లు చేసిందేమి లేదంటూ స్థానిక నాయకులపై మండిపడ్డారు. దీంతో ఈ గ్రామంలో ఒకడు చక్రపాణి ఉన్నాడంటూ మొదలుపెట్టగా వైఎస్సార్‌సీపీ నేత చక్రపాణి, ఎంపీటీసీ రామయ్య, ప్రజలు బయటికి వచ్చారు. ఆ వెంటనే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి ఆగ్రహంతో ఊగిపోతూ 'రేయ్ చక్రపాణి అరవాల్సిన పనిలేదు..నేను ఇక్కడే ఉంటా, నీ ఎమ్మెల్యే చక్రపాణిరెడ్డిని పిల్చుకొచ్చుకో...బెదిరిస్తే భయపడతానా, సిగ్గులేని నాయాల్లారా అంటూ ఊగిపోయారు. పత్రికల్లో రాయలేని బూతులు తూలనాడటంతో అక్కడి వారంతా అసహ్యించుకున్నారు. చెప్తా, చెప్తా బిడ్డా నీ కథ, 13 అయిపోని చెప్తా అంటూ ఆవేశంతో తిట్ల పర్వం మొదలుపెట్టారు. చివరికి గ్రామ నాయకులు అంతా ఏకం కావడంతో పాటు పోలీసులు జోక్యం చేసుకోవడంతో వెనుదిగిరి వెళ్లిపోయారు.

సూపర్ సిక్స్ హామీలన్నీ అబద్ధాలే

డోన్: చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ హామీలన్నీ అంతా భూటకమని, అందమైన, ఆకర్షణీయమైన అబద్ధాలని మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా డోన్ మండలం యు. కొత్తపల్లె, ఉంగరానిగుండ్ల, సీసంగుంతల గ్రామాల్లో మంగళవారం ఆయన పలు సభల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2014 ఎన్నికలలో చంద్రబాబు నాయుడు అబద్ధాలతో ప్రజలను ఆకర్షించి అధికారం చేపట్టి ఏ ఒక్క మంచి పని అయినా ప్రజల కోసం చేశారా అని నిలదీశారు. ప్రజలకు శాశ్వతంగా గుర్తుండిపోయే పనులను చేశానని చెప్పే దమ్ము, ధైర్యం బాబుకు లేదన్నారు. ప్రతి నెల సబ్సిడీపై ఒక సిలిండర్, డ్వాక్రా మహిళల రుణాల మాఫీ, రైతు రుణమాఫీ లాంటి అబద్ధాలతో ప్రజలను మోసం చేసిన చంద్రబాబును ప్రజలు మళ్లీ ఎలా నమ్ముతారన్నారు. సోమవారం డోన్‌లో జరిగిన టీడీపీ ఎన్నికల ప్రచార సభలో చంద్రబాబు తనపై చేసిన ఆరోపణలపై మంత్రి స్పందించారు. డోన్‌లో అభివృద్ధి ఎక్కడా అంటూ చంద్రబాబు మాట్లాడిన చోటనే డబుల్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్, ఆధునిక కూరగాయల మార్కెట్, క్లబ్ హౌస్, ఇండోర్ స్టేడియం, మున్సిపల్ కార్యాలయం కనపడలేదా అని నిలదీశారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి

- ఇంటింటి ప్రచారంలో పార్టీ నాయకులు



ఇంటింటికి వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న పార్టీ అనుబంధ శ్రేణులు

కర్నూలు (టౌన్): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి బీవై రామయ్య, కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్‌ను గెలిపించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్ర బోస్ పిలుపు నిచ్చారు. మంగళవారం స్థానిక 49 వ వార్డులో వైఎస్సార్‌సీపీ నాయకులు పాటిల్ తిరుమలేశ్వర్‌రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, డాక్టర్ హరికృష్ణ రెడ్డి, బాలాజీ రెడ్డి, బీసీ నాయకులు బత్తుల లక్ష్మీకాంతయ్య ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఓటర్లకు జగనన్న మేనిఫెస్టో కరపత్రాలు అందజేశారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. అనంతరం వారు మాట్లాడుతూ అవకాశవాద రాజకీయాలు చేసే చంద్రబాబును ఎన్నికల్లో ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. దేశంలోనే ఎక్కడాలేని విధంగా అనేక ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల మద్దతు ఉందన్నారు. ఈ ఎన్నికల్లో అత్యధిక ఎమ్మెల్యే స్థానాలు సాధించి జూన్ నెలలో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ ప్రమాణ స్వీకారం చేస్తారని స్పష్టం చేశారు.

వైఎస్సార్‌సీపీకి ముస్లిం మత పెద్దలు మద్దతు



ఇంతియాజ్‌ను కలిసి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్న ముస్లిం మత పెద్దలు, తబ్లీ జమాత్‌లు

కర్నూలు (టౌన్) : నగరంలోని ముస్లిం మత పెద్దలు వైఎస్సార్‌సీపీకి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. మంగళవారం కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్‌ను ఆయన స్వగృహంలో మత పెద్దలు, తబ్లీ జమాత్‌లు జుబేర్ మౌలానా, జాకీర్ మౌలానా, మన్సూర్ మౌలానా, మౌలానా అబ్దుల్ రెహెమాన్, దర్గా సాహెబ్ సోహియల్ హఫీజ్, రోజా దర్గా దాదా సాహెబ్ కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో జగనన్న చేసిన అభివృద్ధి, సంక్షేమం చూసి ఆకర్షితులైనట్లు స్పష్టం చేశారు. ముస్లిం మైనార్టీలకు దేశంలో ఎక్కడా లేని విధంగా 4 శాతం రిజర్వేషన్ కల్పించిన నేత వైఎస్సార్ అన్నారు. ఆయన తనయుడు వైఎస్ జగన్ ముస్లింల సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. అందుకే ఆయనకు మద్దతు ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ మాట్లాడుతూ సంపూర్ణ మద్దతు ప్రకటించినందుకు సంతోషం వ్యక్తం చేశారు. మీకు అన్ని విధాలుగా అండగా ఉంటానని మత పెద్దలకు హామీ ఇచ్చారు.

జగన్‌తోనే పేదలందరికీ న్యాయం



మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని

గడివేముల: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా పేదలందరికీ న్యాయం చేశారని.. గ్రామాల అభివృద్ధికి కృషి చేశారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం గడివేముల మండల పరిధిలోని దుర్వేశి, కొరటమద్ది, పెసరవాయి, కరిమద్దెల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ.. జగన్ పాలనలో అర్హతే ప్రామాణికంగా పార్టీలకు అతీతంగా అందరికీ సంక్షేమ పథకాలు అందాయని తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామాలు అభివృద్ధి చెందాయన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 99 శాతం హామీలను అమలు చేశారన్నారు. మేలు జరిగి ఉంటేనే ఓటు వేయండని అడుగుతున్న దమ్మున్న నాయకుడు జగన్ అని పేర్కొన్నారు. 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా మోసం చేశారన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలకు దోచేశారని ధ్వజమెత్తారు. దీంతో వివిధ పథకాలకు అర్హులైన ప్రజలు ఎంతో ఇబ్బందులు పడ్డారని గుర్తుచేశారు.

చంద్రబాబు పాలనంతా కరువుమయం

చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో పంటలు పండకుండా రైతులు కరువును ఎదుర్కొన్నారని ఎద్దేవా చేశారు. టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో వర్షాలు పడక ప్రజలు, రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రకృతి కూడా సహకరించి వర్షాలు సమృద్ధిగా కురిశాయని తెలిపారు. పంటలకు మద్దతు ధర కల్పించడంతో రైతులు వ్యవసాయాన్ని పండుగగా చేసుకున్నారన్నారు. పార్టీలకు అతీతంగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు చెప్పారు. వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి ముంగిటకే ప్రభుత్వ సేవలు అందించిన ఘనత సీఎంకే దక్కుతుందన్నారు. నాడు-నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దారని తెలిపారు. ఫ్యాను గుర్తుకు ఓటు వేసి తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

కలిసికట్టుగా ఇంతియాజ్‌ను గెలిపించుకుంటాం



కార్పొరేటర్లతో కలిసి సమావేశంలో మాట్లాడుతున్న సిట్రా సత్యనారాయణమ్మ

- ఎల్లో మీడియా దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నాం
- విలేకరుల సమావేశంలో నగర కార్పొరేటర్లు

కర్నూలు (టౌన్): తామంతా కలిసికట్టుగా వైఎస్సార్‌సీపీ కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్‌ను భారీ మెజార్టీతో గెలుపించుకుంటామని నగరంలోని 33 వార్డులకు చెందిన పార్టీ కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లు స్పష్టం చేశారు. తాము పార్టీ మారుతున్నట్లు ఎల్లోమీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ఇంతియాజ్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతూ మంగళవారం స్థానిక నరసింహారెడ్డి నగర్‌లోని కార్పొరేటర్ శ్రీనివాసరావు స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు సిట్రా సత్యనారాయణమ్మ, కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో కార్పొరేటర్లు మాట్లాడుతూ టీడీపీ అభ్యర్థి టీజీ భరత్ ఓడిపోతున్నాడనే తమపై అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు. ఎన్నికల ప్రచారం ప్రారంభం నుంచి తామంతా ఇంతియాజ్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతూ వార్డుల్లో పర్యటిస్తున్నామన్నారు. అయితే, టీడీపీకి, పచ్చ పత్రికలకు కనిపించడంలేదన్నారు. 2014, 2019లో మాదిరిగానే 2024 ఎన్నికల్లో కూడా టీజీ ఫ్యామిలీకి ఓటమి తప్పదన్నారు. తామంతా జగనన్న సైనికులమని, పార్టీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించుకుంటామని చెప్పారు. జిల్లా అధ్యక్షులు సిట్రా సత్యనారాయణమ్మ మాట్లాడుతూ కలెక్టర్ పదవి వదిలి ప్రజలకు సేవ చేసేందుకు వచ్చిన ఇంతియాజ్‌ను గెలిపించుకునేందుకు నగరవాసులు సిద్ధంగా ఉన్నారన్నారు. దీనిని చూసి ఓర్వలేక ఎల్లో మీడియా, సోషల్‌మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రచారం ముమ్మరంగా సాగుతుందన్నారు. ప్రజలు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రతి వార్డులో తమకు మంచి ఆదరణ లభిస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జీలు తనకు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని ఎన్నికల్లో తన గెలుపు తథ్యమన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు శ్రీనివాసరావు, షేక్ అహమ్మద్, శేషు యాదవ్, జుబేర్, ఖాదర్‌బాషా, రైల్వేప్రసాద్, షేక్ షాజహాన్ పర్వీన్, షాషావళి, క్రిష్టాకాంత్ రెడ్డి, రాజేశ్వరరెడ్డి, క్రాంతికుమార్, షేక్ యూనస్ బాషా, హకీం, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కర్నూలు(అగ్రికల్చర్):విద్యుత్ లైన్‌ల మెయిన్‌టెనెన్స్ పనులు చేపడుతున్నందున నగరంలోని వివిధ ప్రాంతాలకు బుధవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆ శాఖ అధికారులు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బి.క్యాంపు సెక్షన్ పరిధిలోని మహాలక్ష్మీ నగర్, సోమప్ప కాలనీ, పార్థసారథి నగర్, ఎస్‌సీసీ క్యాంటీన్, హౌసింగ్ బోర్డు కాలనీ, డాక్టర్స్ కాలనీలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయండి



ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని శరీన్‌నగర్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి

కల్లూరు: మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కల్లూరు అర్బన్ 29వ వార్డు కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి కోరారు. మంగళవారం సాయంత్రం కల్లూరు అర్బన్ శరీన్‌నగర్‌లో ఇంటింటికి తిరుగుతూ ఈ ఐదేళ్లలో వైఎస్సార్‌సీపీ చేసిన మంచిని వివరించారు. మరోసారి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డిని గెలిపించుకుంటే వార్డు మరింత పురోభివృద్ధి చెందుతుందన్నారు. జగనన్న సీఎంగా ఉంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో వార్డు నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

పక్కాగా హోమ్ ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ



హోమ్ ఓటింగ్ గురించి వివరిస్తున్న అదనపు కమిషనర్ రామలింగేశ్వర్

కర్నూలు (టౌన్): వచ్చే ఎన్నికల్లో హోమ్ ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియలను పక్కాగా చేపట్టాలని నగరపాలక అదనపు కమిషనర్ రామలింగేశ్వర్ ఆదేశించారు. మంగళవారం స్థానిక నగరపాలక కౌన్సిల్ హాలులో హోమ్ ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించి నియమించిన ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు వెళ్లలేని స్థితిలో ఉన్న వృద్ధులు, విభిన్న ప్రతిభా వంతులు ఇంటి వద్దే ఓటు వేసే హక్కును కేంద్ర ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. ఎన్నికల కమిషన్ ఇచ్చిన గడువులోపు హోమ్ ఓటింగ్ సజావుగా పూర్తి చేయాలన్నారు. ముందుగా ఇంట్లో ఉన్న వారిని బయటకు పంపి సాధారణ పోలింగ్ కేంద్రం తరహాలోనే ఓటరు బ్యాలెట్‌పై ఓటు వేసిన తరువాత బ్యాలెట్ పేపర్‌ను చిన్న కవర్‌లో ఉంచాలన్నారు. ఈ ప్రక్రియను వీడియోగ్రఫీ తీయించాలన్నారు. ప్రతి బృందంలో పోలింగ్ అధికారులు, ఎన్నికల అధికారులు, పోలీసులు, మైక్రో అబ్జర్వర్లు, వీడియో గ్రాఫర్లు ఉంటారన్నారు. 137 కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను స్థానికంగా ఇందిరా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇప్పటికే అక్కడ పోలింగ్ అధికారులను కేటాయించామన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు వచ్చే నెల 5 నుంచి 8 వరకు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపారు.

అనాథ ఆశ్రమంలో జూపూడి జన్మదిన వేడుకలు



అనాథ బాలుర మధ్య కేక్ కట్ చేస్తున్న నేతలు

కర్నూలు(అర్బన్): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు, సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకర్‌రావు జన్మదిన కార్యక్రమాన్ని మంగళవారం స్థానిక అనాథ బాలుర ఆశ్రమంలో నిర్వహించినట్లు మాల సంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ కాసారపు వెంకటేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు కూలీ బిడ్డగా జన్మించిన జూపూడి ఎన్నో అవమానాలు, వివక్షను భరించి కష్టపడి చదివి డా.బీఆర్ అంబేడ్కర్ చూపిన మార్గంలో నడుస్తూ దేశ మాజీ రాష్ట్రపతి డా.అబ్దుల్ కలాంతో కలిసి పనిచేసిన అనుభవం ఉందన్నారు. ఆయన చేసిన కృషికి ఎమ్మెల్సీ, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పదవులను అలంకరించారన్నారు. అనంతరం అనాథ బాలుర సమక్షంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో నేతలు నాగేంద్ర, పి. శ్రీనివాసులు, పి. రాజీవ్‌కుమార్, సుధాకర్, ఏసన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువతి మృతి

పాణ్యం: మండల పరిధిలోని గోనవరం గ్రామం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువతి చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందింది. ఎస్‌ఐ అశోక్ వివరాల మేరకు.. అవుకు మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన శ్రీరాములు అన్నమయ్య, భార్య సులోచన, తలనొప్పితో బాధపడుతున్న సోదరి శ్రీరాములు మానస(18)ని తీసుకుని సోమవారం నంద్యాల ఆస్పత్రికి బైక్‌పై బయలుదేరారు. గోనవరం గ్రామం వద్దకు రాగానే వాహనానికి కుక్క అడ్డు రావడంతో అదుపుతప్పి ముగ్గురూ కిందపడ్డారు. శ్రీరాములు మానస, శ్రీరాముల సులోచనకు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో సులోచనను నంద్యాల జీజీహెచ్‌కు, మానసను శాంతిరామ్ అస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మానస మంగళవారం మృతిచెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. యువతి మృతితో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

రేపటి నుంచి తిమ్మగురుడు బ్రహ్మోత్సవాలు

గూడూరు: పట్టణంలోని తిమ్మగురుడుస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 2వ తేదీ నుంచి ప్రారంభంకానున్నట్లు ఆలయ ఈఓ గుర్రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ నెల 2వ తేదీ(గురువారం) ప్రభోత్సవం, 3న ప్రారంభ రథోత్సవం, 4న సంపూర్ణ రథోత్సవం, 5న గరుడోత్సవం, 6న పార్వేట ఉత్సవం, 7న వసంతోత్సవం జరుగుతుందని వెల్లడించారు.

సారా బట్టీ ధ్వంసం

కోడుమూరు రూరల్: కోడుమూరు సెబ్ పరిధిలోని వెల్దుర్తి మండలం ఎల్.బండ అటవీ ప్రాంతంలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న నాటుసారా స్థావరంపై దాడి చేసి 450 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. 30 లీటర్ల సారా, ద్విచక్రవాహనాన్ని సీజ్ చేసినట్లు చెప్పారు. నిర్వాహకుడు బోయ అయ్యస్వామిని అరెస్ట్ చేసి డోన్ కోర్టులో హాజరుపరగా, జడ్జి రిమాండ్‌కు ఆదేశించారని వివరించారు.

